



# "గాలివాలు" ★

రచన :
మండప శ్రీనివాసరావు

సుబ్రమణ్యాన్ని గురించి ఈ నాడు కొత్తగా పరిచయం చెయ్యవలసిం దేమీలేదు. అన్నట్టు సుబ్రమణ్యం అంటే మీకు తెలీక పోవచ్చు. రేనూరి సుబ్రమణ్యం-అవును. ఈసరికి మీకు తెలిసే ఉంటుంది ?

అతని కథలు మీలో చాలామంది చదివే వుంటారు. అతని నాటికలు "ఆకాశవాణి" అనేకసార్లు ప్రసారం కూడ చేసింది. తెలుగు కథావీథికి, అత నెన్నో వన్నెలూ చిన్నెలూ సమకూర్చా డంటూ తెలుగుపత్రికలన్నీ కీర్తించిన విషయం మీ కందరకూ తెలుసుననుకుంటాను... అతనో ప్రసిద్ధ కథకుడనీ రచనా విధానంలోనూ, వస్తువును ఎన్ను కోవడంలోనూ, కొత్తదోవలు తొక్కాడనీ, అతని మూలాన తెలుగుకథకు, తెలుగు సాహిత్యానికీ, విశేష విఖ్యాతి, ప్రచారమూ, వచ్చాయన్న విషయంలో ఎవ్వరికీ అనుమానం ఉండదనుకుంటాను.

దురదృష్టవశాత్తూ అతన్ని గురించి లోకానికి ఇంతే తెలుసుననుకుంటూ, ఇంతకన్నా ఎక్కువ తెలుసుకోవడానికి, అదెప్పుడూ ప్రయత్నించలేదు. బహుశా భయపడి ఉంటుందేమో ? లేకపోతే అతని వ్యక్తిగత జీవితంతో దానికి సంబంధం లేదేమో ?

కానీ, నాకుంది. సుబ్రమణ్యం నా స్నేహితుడు. ఈవిషయం బహుశా ఎవ్వరికీ తెలీక పోవచ్చును. మా మధ్య అడ్డుగోడలు లేవు. అరమరికలూ లేవు. దాచుకోవల్సినవి, దోచుకోవల్సినవి అంతకన్న లేవు.

అనేకసార్లు అతన్ని నేను గుచ్చి గుచ్చి అడిగాను "సుబ్రమణ్యం నీ కెందుకీ పిచ్చివ్యామోహం ! సాహిత్యాన్ని నమ్ముకొన్నవా డెవ్వడైనా, ఇంతవరకు ఈ సృష్టిలో బాగుపడలేదు. బాగుపడ్డ ఉదాహరణ గత చరిత్రలో ఒక్కటి కూడాలేదు. ఇకముందుగూడా ఉంటుం దని నే ననుకోను'' అన్నాను నేను !

''బహుశా ఉండకపోవచ్చు''అన్నాడు సుబ్రమణ్యం చాలా మామూలుగా, అతి తేలికగా,

"అయినప్పుడు నీ ప్రవర్తనకు అర్థం లేదు" అన్నాను రవ్వంత కోపంగా.

"నేనలాఅనుకోవడంలేదు"అన్నాడు సుబ్రమణ్యం నిర్లక్ష్యంగా నవ్వుతూ.

నేనన్న మాటల్లో నవ్వుకోవలసిం దేమున్నదో, ఎంత ఆలోచించినా నాకు పాలుపోలేదు.

"నువ్వన్నా ఒంటరిగాడివి కాదు"

"ఆవిషయం నాకు ప్రతిక్షణం తెలుస్తూనే వుంది" అన్నాడు తను.

''బహుశా ఇది నన్ను ఉబ్బెయ్యడాని కంటున్నావనుకొంటున్నాను" అన్నాను కసిగా.

"లేదుభాయీ ! మనుషుల్ని ఉబ్బెయ్యటం నాకింకా చేతకాలేదు, ఇక ముందు గూడా చేతకా దనుకుంటాను. బహుశా ఇప్పుడు నేను పడుతున్న బాధలన్నింటికీ ఇదే కారణం కావచ్చు" అన్నాడు సుబ్రమణ్యం.

"అసలు విషయం దాటవేస్తున్నావు మిష్టర్ ! నువ్వేం చేస్తున్నా వన్నది ముఖ్యంకాదు—నీ భార్యాబిడ్డలను ఏం చేస్తున్నావన్నదే ముఖ్యం—నీ పిల్లల్ని చూడు! ఒంటిమీద ఒక్క మంచిపాత లేదు, ఓ చదువులేదు, తిండిగూడా సరిగాలేదు''

''ఇంతకన్నా అథమంగా జీవిస్తున్న వారు, కోట్లమందున్నారు"

అని వాదిస్తాడు సుబ్రమణ్యం. అక్కణ్ణించి లేచిపోయా.

పరిస్థితులు మనిషిని ఎంతగా మారుస్తాయో, చెప్పడానికి సుబ్రమణ్యం ఓ తిరుగులేని చక్కని ఉదాహరణ. తన చేతగానితనాన్నంతా కప్పిపెట్టుకొనడానికి, అతనో విధమైన వాదనను తయారుచేసుకున్నాడు. దాన్ని తన ప్రత్యర్థులమీద ఉపయోగిస్తుంటాడు. ఇది ప్రతివారికీ తప్పదేమో ననుకుంటాను.

గర్భదరిద్రుడు - ధనవంతులు సుఖపడటం లేదనుకోవటానికీ, నిరుద్యోగి, తమ అధికారికింద అణిగిమణిగి ఉండటంలేదని తృప్తిపడటానికీ-మరి కారణం కనిపించదు. తమ లోపాలను, లొసుగులను అంగీకరించలేక, వాటిని

మంచితనంకింద స్వీకరిస్తూ చేసే ఇలాంటి వాదనలకు అర్థమేమిటి ?

ఇన్నింటికీ నాబాధ - సుబ్రమణ్యాన్ని గురించి కానేకాదు. వాడెలా చచ్చినా నాకభ్యంతరంలేదు. నా విచారమల్లా, పాపం వాడి భార్యనుగురించీ నలుగురు పిల్లల్ని గురించీనూ. కాపరానికి వచ్చే నాడు, ఆ ఇల్లాలి వంటినిండా ఎన్నో నగలున్నాయి. ఆరేళ్ళు గడవలేదు. భారత విదేశీనిలవల్లా, అవన్నీ కరిగిపోయాయి.

పైగా అదంతా చాలదన్నట్లు బోలెడంత అప్పుదేల్చాడు. భారతదేశంతోటి అవసరం కొద్దీ, విదేశాలు ఇంకా అప్పులిస్తున్నాయి, మరి సుబ్రమణ్యంతో ఎవ్వరికీ అవసరంలేదు. అవసరమున్నా పత్రికలు, అందులోనూ ఉదారబుద్ధి గలవారూ, అప్పుడప్పుడూ అయిదు పదీ పంపుతూనే వున్నారు.

అయినా ఆవేమూలాలకు సరిపడతయి? ఇతగాని సాహిత్యయజ్ఞంలో, భార్యాపిల్లలు సమిధల్లా ఆహుతైపోతున్నారు. తనకు తానుగా, చావడానిగ్గూడా వీల్లేని మనదేశంలో మరొకర్నిలా చంపడానికి అధికారం ఉండటం ఆశ్చర్యంకదూ ?

కష్టాలు భరించడానికయినా ఓ హద్దు పద్దూ అంటూ వుండాలనుకుంటాను. అంతకుమించి భరించవలసి వచ్చినప్పుడు మనిషి, విధిగా ఎదురుతిరగక తప్పదు.

ఏడేళ్ల తరువాత సుబ్రమణ్యం ఆ పనే చేసాడు. ఎన్నో సంవత్సరాలు చెవినిల్లు గట్టుకుని చెప్పినా వినిపించుకోని సుబ్రమణ్యం, పరిస్థితులు చెప్పినమాట విన్నాడు. తను నమ్మిన విషయాలను రాయటం మానేశాడు. జనం నమ్మే వాటినే రాయడం ప్రారంభించాడు. ప్రజలు ఏది వెర్రిగా చదివితే, దాన్ని గురించి రాశాడు. "ప్రజల వేలంవెర్రికి గంగవెర్రు లెక్కించాడు."

సెక్సు కథలకోసం, పాఠకులు అంగలార్చినప్పుడు, అవీ రాశాడు. డిటెక్టివ్ కథలకోసం ఎగబడ్డప్పుడు, వాటినీ రాశాడు. మిస్టరీకథలు బాగా చదువుతున్నారని పసికట్టాడు. దయ్యాలూ, భూతాలూ, మంత్రాలూ తంత్రాలూపెట్టి రాశాడు. తూనీగను రాజకుమార్తెను చేశాడు. రాక్షసుడి ప్రాణం చిలకలో వుంచాడు. పాఠకుల్లో సుబ్రమణ్యం పుస్తకాలకోసం, ఎగబడటం అలవాటు అయిపోయింది. అతనురాశిన పుస్తకాల్లోకల్లా "లంగాలో సింగరుమిషను" అన్న అత్యద్భుత అపరాధ పరిశోధన నవల, అరువారాల్లో 16 వేల కాపీలు అమ్ముడయింది.

"ఇక చూడండీబాబూ! వాడితడాఖా! వెనకేమిరాశాడో, ముందేమిరాయాలో తెలీకుండానే, అతను డజన్లకొద్దీ పుస్తకాలురాసి పడేశాడు పబ్లిషర్లు వేడివేడి రొట్టెల్లా వాటినల్లా కొనేశారు. రెండు చేతులా ఎడాపెడా సంపాదించాడు. కొంత నిల్వచేశాడు. ఆఖరుకో పబ్లిషరు, నెలకు 250 జీతంమీద అతనికి నవలలు రాసే ఉద్యోగం ఇచ్చాడు.

ఈ రోజున అతనికి ఏలోటూ లేదు. మంచి చక్కని ఇంట్లో ఉంటున్నాడు. ఖరీదైన గుడ్డలు వేసుకొంటున్నాడు. ఖరీదైన సిగరెట్లు కాలుస్తున్నాడు. మాసినకోకల్తో తప్ప కనిపించని అతని భార్య, ఈ రోజున జార్జెట్ చీరెలు తప్ప మరోగుడ్డ వాడటంలేదు. వాళ్ళ పిల్లలు రిక్షామీద తప్ప బడికిపోరు. అతనయినా ఫస్టుక్లాసుకి తక్కువ క్లాసుకి సినిమాకి పోడు.

అతని ఆర్థిక పరిస్థితి బాగుపడినందుకు సంతోషించాను — కాదు— సంతోషించినట్లు నటించాను. ఇప్పటి సుబ్రమణ్యంను చూస్తె, నా కెందుకో ఆప్యాయంగా కావలించుకో బుద్ధి కాలేదు. అతనన్నా ప్రతిమాటలోనూ, డబ్బు చేసుకోవటం, అన్నవిధానమే నాకు కనిపించింది. అతను నా స్నేహితుడేనని నేనుభావించలేకపోతున్నాను. అతనికీ, నాకూ మధ్య వేలమైళ్లదూరం ఉన్నదనిపించింది. ఈ అయిదేళ్లలోనూ, అతని కలంనుంచి, ఒక్క మంచికథ రాలేదు. ఈమాట నేనే కాదు. చాలామంది అన్నారు. కానీ, మంచికథలు రాసినంత కాలమూ మా సుబ్రమణ్యం మట్టిగొట్టుకు పోయాడు. మూడో తరగతి సాహిత్యం దించాడు. బాగుపడ్డాడు. అతన్నీ స్థితికి తెచ్చిన వాణ్ణి నేనేనని, నాకు తెలుసు అయితే, ఈస్థితికి అతన్ని తెచ్చినందుకు సంతోషించాలా? విచారించాలా? సెలవు.

★

